క్లుప్తంగా

పందిళ్లమ్మకి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పందిళ్లమ్మ తల్లి

వేటపాలెం: పందిళ్లపల్లి శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న గ్రామ దేవత పందిళ్లమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారం రోజులుగా గ్రామంలో నిర్వహిస్తున్న అమ్మవారి కొలుపులు పొంగిళ్లు చెల్లింపుతో ముగిశాయి. గ్రామంలో ప్రజలు ఆలయానికి చేరుకొని ఆలయ ప్రాంగణలో పొంగళ్ల పొంగించు కొని మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యుత్ స్తంభంపై మంటలు


విద్యుత్ స్తంభంపై చెలరేగిన మంటలు

చీరాల అర్బన్: షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ స్తంభంపై మంటలు చేలరేగాయి. ఆదివారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షం కారణంగా స్థానిక పాలిమేర రోడ్డులోని సత్యా షాపింగ్ మాల్ వద్ద విద్యుత్ స్తంభంపై షార్టు సర్క్యూట్ అయింది. వర్షం కారణంగా రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మరమ్మతుల అనంతరం పునరుద్ధరించారు.

రావుల శివప్రసాద్ బాబుకు నివాళి


రావుల శివప్రసాద్‌బాబుకు నివాళి అర్పిస్తున్న కరణం వెంకటేష్‌బాబు

చీరాల: పేరాల మాజీ కరణం రావుల శివప్రసాద్‌బాబు ఆదివారం మరణించడంతో ఆయన భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు కొత్తపేటలోని మృతుని నివాసంలో నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జూదరుల అరెస్ట్

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో గంగవరం శివారు పొలాల్లో పేకాటాడుతున్న వ్యక్తులను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న వ్యక్తులను ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి 10 మంది వ్యక్తులను, వారి వద్ద నుంచి రూ. 12100 నగదు, 9 సెల్ ఫోన్‌లు, 4 బైక్‌లను సీజ్ చేశారు.

సీపీఐ మహా సభలు జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అద్దంకి రూరల్: ఈనెల 23న అద్దంకిలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా రెండో మహా సభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయం భూపేష్ భవనంలో మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ప్రజలపై మోపుతున్న అధిక భారాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. మహా సభలకు జిల్లా నలుమూలల నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శి తుమ్మల పూర్ణ చంద్రశేఖర్, కార్యదర్శి గర్నెపూడి ప్రసాద్, కోశాధికారి కేఎల్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రాంతమా?.. ప్రభుత్వ స్థలమా!

చీరాల టౌన్: చీరాల ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంతం ప్రయివేటు వాహనాల పార్కింగ్‌కు కేంద్రంగా మారింది. చీరాల పట్టణం, గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు వచ్చే తహసీల్దార్, మండల పరిషత్, ఉపఖజానా, హౌసింగ్, ఆర్ అండ్ బీ కార్యాలయాలు ఒకేచోట ఉండటంతో వివిధ పనుల కోసం వచ్చేవారికి ఆటకంలేకుండా అప్పట్లో కృషి చేశారు. అయితే భూముల రిజిస్ట్రేషన్, షాపింగ్ కోసం చీరాల వచ్చిన వారి వాహనాలతో ఆ ప్రదేశం నిండిపోతోంది. తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ల కోసం, కూరగాయల మార్కెట్‌లో కొనుగోలుకు వచ్చిన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను తహసీల్దార్ కార్యాలయం ముందు నిలుపుదల చేస్తున్నారు. దీంతో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల స్థాయి అధికారులు స్పందించి చీరాల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రయివేటు వాహనాల నిలుపుదల లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


పార్కింగ్ ప్రదేశంగా మారిన మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయం

అన్నదాతకు అన్యాయం

- ఇతర శాఖల అధికారులు డుమ్మా
- వారానికి నాలుగు గ్రామాల్లో నిర్వహించాలనేది లక్ష్యం
- మమ అనిపిస్తున్న అధికారులు

వేటపాలెం:

రైతుల అభ్యున్నతి గురించి కూటమి ప్రభుత్వం మడెమ తిప్పుతోంది. పొలం పిలుస్తోంది కార్యక్రమ లక్ష్యం మసకబారుతోంది. వాస్తవానికి గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడంతో పాటు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారాన్ని అందించాలి. విత్తన ఎంపిక మొదలు ఎరువులు, తెగుళ్లు, పురుగుల నివారణ మందులు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అన్ని సమస్యల పై నేరుగా చర్చించి అవగాహన కల్పించాలి. అయితే క్షేత్ర స్థాయిలో వ్యవసాయాధికారులు మినహా మిగిలినవారు కనిపించడంలేదు. మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల చొప్పున వారానికి నాలుగు గామాల్లో పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాల్సి ఉంది. రైతులుకు సాగుపై అవగాహన, మెళకువల గురించి అవాగాహన కల్పించాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయాలి. వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించాలి. క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలను తక్షణమే పరిష్కారం సూచించాలి. తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కు నికరణ ఆదారం దిశగా ప్రోత్సహించాల్సి ఉంది. కానీ వీటిలో ఏ ఒక్కటీ జరగడంలేదు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

ముందస్తు సమచారం లేక డీలా..

ఏ రోజు ఏ గ్రామంలో కార్యక్రమం జరుగుతుందో అని గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకపోవడంతో రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వారి షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి అటుగా వచ్చి వెళ్లే రైతులను కూర్చోబెట్టి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. దీంతో విత్తు నుంచి ఉత్పత్తి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన లేక రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో పాటు అనుబంధ శాఖ లైన హార్టికల్చర్, సెరీకల్చర్, ఫిషరీష్, వెటర్నరీ, మార్కెటింగ్, విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, విద్యుత్, జలవనరులు శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉంది. వారితో పాటు రైతు మిత్ర సంఘాలు, భూసార పరిరక్షణ అధికారులు హాజరై అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. అలాగే ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, రాయితీను వివరించి రైతుల్లో చైతన్యం పెంచాలి. కానీ ఇతర అధికారులు ఎక్కడ ఉంటున్నారో ఎవరికీ తెలియడంలేదు.

శాకంబరిగా గంగమ్మ తల్లి


కూరగాయలతో అలంకరించిన దృశ్యం


గంగమ్మ తల్లికి సారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆడపడుచులు

కారంచేడు: ఆషాఢమాసంలో చివరి ఆదివారం గ్రామ దేవత గంగమ్మ తల్లిని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గంగమ్మకి భక్తులు తలంటు చేసి అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లు, ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని సైతం అనేక రకముల కూరగాయలను క్వింటాళ్ళ కొద్దీ తెప్పించి అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తులతో పాటు, కారంచేడు, పర్చూరు, చీరాల, బాపట్ల, ఇంకొల్లు మండలాలకు చెందిన అనేక మంది భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి గ్రామ ఆడపడుచులు సారెను తీసుకువచ్చి ఘనంగా అందించారు. మేళ తాళాలు, కనకతపెట్లతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. భక్తులు అమ్మవారి ఆలయం ముందు ప్రత్యేక నృత్యాలు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పాల కావిళ్లు


పాలకావిళ్లతో గ్రామోత్సవం చేస్తున్న భక్తులు


పాలకావిళ్లతో వస్తున్న మహిళలకు హారతులతో స్వాగతం పలుకుతున్న భక్తులు

కారంచేడు: ఆషాఢమాసం ఆదివారం కావడంతో మండల కేంద్రమైన కారంచేడు చెరువు కట్టమీద కొలువైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు పెద్ద ఎత్తున పాల కావిళ్ళను సమర్పించారు. ఆదివారం వేకువజాము నుంచి భక్తులు ప్రత్యేక అలంకరణలో స్వామివారి సన్నిధికి పాలకావిళ్లను ఊరేగింపును నిర్వహించారు. కాలువ సెంటర్ నుంచి యజ్ఞశాల పేట, స్టేట్‌బ్యాంక్ సెంటర్, చినవంతెన సెంటర్, మాస్కోబజారు మీదగా పాల కావిళ్ళను భుజాలపై ఉంచుకొని గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

కూటమి ప్రభుత్వానిది దుర్మార్గ వైఖరి


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు

అద్దంకి రూరల్: కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపకుండా కూటమి ప్రభుత్వం దుర్మార్గ వైఖరి అవలంబిస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆండ్రా మాల్యాద్రి అన్నారు. ఆదివారం అద్దంకిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించి సమ్మెకు మద్దతు తెలియజేశారు. సమ్మెకు సీపీఐ, సీపీఎం సంపూర్ణ మద్దత్తు తెలియజేస్తుందన్నారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన జీవో నంబర్ 39ని అమలు చేయాలని కార్మికుల సమస్యల కోసం చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర వస్తుల ధరలకు అనుకూలంగా కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. సమస్యలకు పరిష్కారం లభించకపోతే సీపీఐ, సీపీఎంతో పాటు ప్రజాసంఘాల భాగస్వామ్యం చేస్తామన్నారు. తంగిరాల వెంకటేశ్వర్లు, నాయకులు డి. గంగాధర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి. ఆదాం, ఇంజినీరింగ్ విభాగం నాయకులు ఉసురుపాటి శామ్యూల్, జి.మార్కు, కె. మారుతి, డి. జాషువా, ఎం. కోటేశ్వరరావు, ఎం. రమేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణ లక్ష్యం


ఇంకొల్లులో మాదక ద్రవ్యాలపై అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ సురేష్

ఇంకొల్లు(చినగంజాం): మాదక ద్రవ్యాలు పూర్తి స్థాయిలో నివారించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఇంకొల్లు ఎస్‌ఐ సురేష్ అన్నారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారి నడవడిక గుర్తించాలన్నారు. ఎక్కడైనా ఎవరైనా విద్యార్థులు, చిన్నారులు మాదక ద్రవ్యాలు సేవిస్తున్నట్లు మీ దృష్టికి వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తమ పిల్లలు కాదుగా తమకు ఎందుకులే అనుకునే భావతో ప్రజలు ఉండవద్దని రానున్న రోజుల్లో తమ పిల్లలు కూడా డ్రగ్స్‌కు అలవాటై ఇబ్బంది పడితే ఆ బాధలు తెలుస్తాయన్నారు. ఎక్కడైనా విక్రయిస్తున్నా, సేవిస్తున్నా 1972 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం అందించాలని కోరారు.

ఘనంగా పోలేరమ్మకు సారె

చినగంజాం: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ మూలగాని వారిపాలెం గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమ, సారె కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో మహిళా భక్తులంతా కలిసి గ్రామంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, సారెలు తీసుకొని ఊరేగింపుగా బయలుదేరి గ్రామంలో ప్రధాన వీధుల్లో ఆలయానికి చేరుకున్నారు. మేళతాళాలతో, బాణసంచాలతో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.


మూలగాని వారిపాలెంలో ఊరేగింపుగా సారె తీసుకెళుతున్న భక్తులు

ఆదివారం ఆనందంగా..


సముద్రంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్ర తీరంలో సందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో బాపట్ల జిల్లాలోని చీరాల, పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని నర్సరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లోని గ్రామాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధిక సంఖ్యలో వాడరేవుకు చేరుకున్నారు. సముద్రపు మన్నుతో ఆడలాడుతుకుంటూ కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానాలు ఆచరించారు. తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామికి, గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీరంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సివిల్, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి


సంతరావూరు ప్రధాన రోడ్డులో వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్న ప్రజలు


సంతరావూరు పాఠశాల వీధిలో రోడ్డుపై నిలిచిన నీరు

చినగంజాం: మండలంలోని సంతరావూరు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే చాలు గ్రామంలోని రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. వర్షపు నీరు పోయే మార్గంలేక రోడ్లపై నిలిచి పోతున్నాయి. దాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నీరు రోడ్లపై నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో ఏ ప్రాంతంలోనూ డ్రైనేజీ కాలువలు లేక ఈ అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనులపై అవగాహన అవసరం

బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం వలసలను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం పనులపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్‌ఆర్‌పీ కనకారావు కోరారు. ఆదివారం కొప్పరపాడులో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో జరిగిన పనులపై అవగాహన సదస్సు ఉపాధి హామీ పథకం అమలు తీరు హక్కులపై ర్యాలీ నిర్వహించారు. మండలంలో రూ. 12 కోట్లతో జరిగిన 645 పనులకు సంబంధించి గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.


కొప్పరపాడులో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఆర్‌పీ

మిథున్ రెడ్డి అరెస్ట్ కక్ష సాధింపు చర్య


పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: రాజంపేట పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కేవలం కక్ష సాధింపు చర్యే అని.. ఆయన అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివారం అద్దంకి నియోజకర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ప్రజల సమస్యలను గాలికి వదిలి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపులకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చే విధంగా కుట్రపూరితంగా వ్యవహరించటం దుర్మార్గమన్నారు. వీటన్నింటికీ సమాధానం చెప్పే రోజులు వస్తాయన్నారు.

బోర్లకింద వరినారుమళ్లు

బల్లికురవ: బోర్లకింద వరినాళ్ల పెంపకానికి రైతులు గ్రామాల వారీగా సమాయత్తమయ్యారు. మండలంలోని కొప్పరపాడు, వైదన, కొమ్మినేనివారిపాలెం, కూకట్లపల్లి, గొర్రెపాడు, అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం గ్రామాల్లో వారం రోజుల నుంచి బీపీటి రకం వరి సాగుకు దుక్కులు దున్ని విత్తనాలు భూమిలో చల్లుతున్నారు. కురుస్తున్న చిరుజల్లుల ప్రభావానికి వరినారుమళ్లు మొలకలతో ఆశాజనకంగానే ఉన్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 30 నుంచి 40 రోజుల్లో నారు యాతదశక వస్తుందని ఈ లోపు పొలాలు బాగు చేసుకుంటామని రైతులు వివరించారు.


కొప్పరపాడులో బోర్ల కింద వరినాళ్ల పెంపకం

విస్తారంగా వర్షాలు


ఇంకొల్లు: నిలిచిపోయిన వర్షపునీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారుడు


ఇంకొల్లు: వర్షపు నీరు నిలవడంతో పాదచారుల అవస్థలు

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లులో ఆదివారం సాయంత్రం గాలి వానతో భారీగా వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇంకొల్లులో మురుగు కాలువలను ఆక్రమించుకోవడంతో నీరు పోయే మార్గం లేక నీరు ఎక్కడికక్కడే నిలిచి పోయే పరిస్థితి తలెత్తింది. ఆదివారం నాటి భారీ వర్షానికి నీరు నిలిచి పోవడంతో రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వాహనదారులు, పాదచారులు నిలిచిన వర్షపు నీటి కారణంగా తీవ్ర అసౌకర్యం తప్పలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ వ్యవస్థను సరి చేయాలని కోరుతున్నారు.

బల్లికురవ: వాతావరణ శాఖ హెచ్చరికలతో శనివారం రాత్రి నుంచి బల్లికురవ మండలంలో చిరుజల్లులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కన్నా ఉరుములు, మెరుపులు ఉధృతంగా ఉండటంతో రైతులు, ప్రజలు ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని బెంబేలెత్తుతున్నారు. పొలం పనులకు వెళ్లాలన్నా, పశువులను తోలుకుని పొలం వెళ్లాలన్నా భయందోళన చెందుతున్నారు. పత్తి మొక్కజొన్న, మిరప ప్రత్తి పశుగ్రాసం, కురగాయాల సాగుకు దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు భూములు సిద్ధం చేసుకున్నారు.

అద్దంకి రూరల్: అద్దంకిలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత నాలుగు రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో ప్రజలు ఉక్కపోతలకు గురయ్యారు. వాతావరణం చల్లబడి వర్షం కురవటం కొంత ఆనందాన్నించింది భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇప్పటి వరకు 58.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయిందని, 6 మిల్లీ మీటర్ల నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపారు.

చీరాల అర్బన్: చీరాల పట్టణ, పరిసర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉన్నా సాయంత్రానికి వాతావరణం చల్లపడింది.